టీడీపీని ఓడించేందుకు ప్రజలు 'సిద్ధం'

- మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి
- వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

కదిరి: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని మరోసారి ఓడించేందుకు ప్రజలంతా సిద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ నెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' భారీ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మక్బూల్ తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగనన్న అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని పేదలకు చేరువ చేశారని, అందుకే ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని చెప్పారు. ప్రతి ఇంట్లో జగనన్నను దేవుడిలా చూస్తున్నారన్నారు. జగనన్న 124 సార్లు బటన్ నొక్కి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారని, ఆయన కోసం వైఎస్సార్‌సీపీ తరఫున బరిలోకి దిగే ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థికి మరో ఓటు వేసేందుకు మేమంతా సిద్ధం అని ప్రతి మహిళా అంటోందని ఆయన తెలియజేశారు. ఏపీ అభివృద్ధి చెందాలంటే కొన్ని దశాబ్దాల పాటు జగనే సీఎంగా ఉండాలని మేధావులు సైతం అంటున్నారని మక్బూల్ గుర్తు చేశారు.

దళారీ బెడద తప్పింది: చంద్రబాబు పాలనలో అర్హత ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీలు చెబితే కానీ పథకాలు అందేవి కాదని, జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికమన్నారు. 'మీకు నా వల్ల మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండి' అని ధైర్యంగా చెప్పిన ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేడన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు ధర్మానికి.. అధర్మానికి మధ్య జరుగుతున్నవని, పేదలంతా జగనన్న పక్షాన ఉంటే పెత్తందార్లు బాబు వైపు ఉన్నారని మక్బూల్ గుర్తు చేశారు.

పెద్ద సంఖ్యలో తరలిరండి..

ఈ నెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో జరగనున్న 'సిద్ధం' మహా సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పిలుపు నిచ్చారు. ఆ సభ కోసం కదిరి పట్టణంతో పాటు ప్రతి గ్రామానికి పెద్ద సంఖ్యలో వాహనాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి 3 లక్షల మందికి పైగా సభకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, కౌన్సిలర్లు షబ్బీర్, పిచ్చిలి శంకర్, దాదా పీర్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు లోకేశ్వర రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వేమల ఫయాజ్, ఎస్కేయూ పాలకమండలి సభ్యులు కొమ్ము భాస్కర్, సీనియర్ అడ్వకేట్ సీవీ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


'సిద్ధం' సభ పోస్టర్లు విడుదల చేస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, తదితరులు

'గడప గడప'లో ఘన స్వాగతం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ మంగళవారం కదిరి పట్టణంలోని 12వ వార్డులో పర్యటించారు. ఆయనకు ప్రతి గడపలో మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా తామంతా లబ్ధి పొందామని జగనన్నకే మా ఓటు అని ప్రజలంతా ముక్తకంఠంతో చెప్పారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖాసీం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

నల్లచెరువు: మండల పరిధిలోని బాలేపల్లి తండాకు చెందిన టీడీపీ కార్యకర్తలు మూడే మహేంద్ర నాయక్, ఎం.నరసింహులు నాయక్, భాస్కర్ నాయక్, రామకృష్ణ, వెంకట రమణ నాయక్, బి.వెంకటేష్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో పార్టీలో చేరారు. మంగళవారం వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. అంతకుముందు బొమ్మిరెడ్డి పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, బాలాజీ హోటల్ అధినేత, ఎస్.ములకలపల్లి సింగల్ విండో అధ్యక్షుడు బొమ్మిరెడ్డి సుధాకర్‌రెడ్డి మక్బూల్ అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, హైటెక్ రమణా నాయక్, నజీర్, మహమ్మద్ రఫి, బాలక్రిష్ణ నాయక్, తదితరులున్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

సీఎం సభను విజయవంతం చేయాలి

రాప్తాడు: ఈ నెల 11న రాప్తాడు ఆటోనగర్ సమీపంలో నిర్వహించనున్న ఎన్నికల శంఖారావం సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ఆయన కుమారుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కోరారు. వైఎస్సార్ జిల్లా, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల వైఎస్సార్ సీపీ సన్నాహక సభ 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఆటోనగర్ సమీపంలోని స్థలాన్ని చదును చేయడం, టెంట్లు, సభాస్థలి, వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కుట్ర రాజకీయాలకు తెరలేపాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై వారి అనుకూల పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వీరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా విద్యా, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ, పెన్షన్స్ దేశానికే తలమానికమన్నారు.


సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైనాట్ 175 లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ యర్రగుంట జనార్దన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి విధులకు రారా?

- సచివాలయ సిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం

ఎన్పీకుంట: మండలంలోని పలు సచివాలయ సిబ్బందిపై ఎంపీడీఓ ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్.పీ.కుంట-1, ఎన్.పీ.కుంట-2 సచివాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం 10.45 గంటలకు వీఆర్ఓ మినహా ఇతర సిబ్బంది హాజరుకాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మహిళల పేరిట ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన పట్టాలకు ఆ మహిళల పేరిట రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయా సచివాలయాల ద్వారా చేస్తున్నారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో లబ్ధిదారులు అధికారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గమనించిన ఎంపీడీఓ ఆయా సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైన పద్ధతి మార్చుకొని అంకితభావంతో విధులు నిర్వహించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ

అర్హులందరికీ ఓటు హక్కు

ధర్మవరం అర్బన్: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఓటు హక్కును కల్పిస్తామని ఆర్డీఓ వెంకటశివరాంరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫారం-6,7,8 లలో వచ్చిన క్లెయిమ్‌లను పూర్తి దశలో విచారణ జరిపి కంప్యూటర్‌లో నమోదు చేశామన్నారు. కొత్తగా వచ్చిన క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఓటు హక్కు కల్పించే విధంగా తాము కృషి చేస్తామని తెలిపారు. మృతులు, బదిలీలు, డబుల్ ఓట్లు, తొలగింపులు వీటన్నింటిపైన పారదర్శకతతో కూడిన పనులను బీఎల్ఓలు చేత నిర్వర్తించడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును పొందే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ లక్ష్మిదేవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరాంరెడ్డి

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

ఎన్పీకుంట: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేంద్ర కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రానికి సమీపంలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పక్కనున్న ఓ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకులషెడ్డును మంగళవారం పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రేకులషెడ్డు ఏర్పాటు చేసుకున్న రాజేంద్ర, కుటుంబ సభ్యులతో వారు మాట్లాడారు. తమకు ఉండటానికి ఇల్లు లేదని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం హంద్రీనీవా కాలువకు పోయిందని, దీంతో రేకులషెడ్డు నిర్మించుకున్నానని అధికారుల ఎదుట వాపోయారు. ఇంటి స్థలం కావాలంటే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని, అర్హతలను బట్టి ఇంటిస్థలం మంజూరు చేస్తారని తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని షెడ్డు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు వివరించారు. రెండు రోజుల్లో రేకులషెడ్డును తొలగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారి సామగ్రిని అప్పగించి, రేకులషెడ్డును సీజ్ చేశారు. కార్యక్రమంలో డీటీ రవినాయక్, సర్వేయర్ అశోక్, జమేదార్లు నూర్‌మహమ్మద్, నరసింహమూర్తి, వీఆర్ఓ దీపిక, కిష్టప్ప, వీఆర్ఏ రూప, హోంగార్డులు మౌలాసాహెబ్, రాజు తదితరులు ఉన్నారు.


రేకుల షెడ్డును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

పుట్టపర్తి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పూర్తి సహకారాలను అందించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన తహసీల్దార్లు, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇంకా ఓటర్ల తుది జాబితాలో తప్పులు, మార్పులు, చేర్పులు, మరణించిన ఓటర్ల వివరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 18 సంవత్సరాల వయసు పైబడిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా సీఎస్‌సీ కేంద్రాలలో నమోదు చేసుకోవచ్చన్నారు. నూతన తహసీల్దార్లు ఆయా మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈనెల 9న ఎన్నికల నియమావళిపై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అంజయ్య, పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, బుక్కపట్నం, తహసీల్దార్లు వేణుగోపాల్, నాగభూషణం, కళావతి, రామక్రిష్ణ, ఈడీటీలు నరసింహులు, రెహమాన్, తరుణ్‌తేజ్ , గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రముఖులు , తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

9న నులి పురుగుల నివారణ దినోత్సవం

పుట్టపర్తి అర్బన్: ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర రెడ్డి, డాక్టర్ జ్యోత్స్న, ఎంఈఓ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. పిల్లల కడుపులో ఉన్న నులి పురుగులను తొలగించడానికి ఆల్‌బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. 9న జరిగే నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలంలో సుమారు 6,686 మంది పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. ఒకటి నుంచి 2 సంవత్సరాల లోపు వయసు పిల్లలకు అర్ధ మాత్ర, 2-19 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీ మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత నమిలి మింగించాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాతనే మాత్ర వేసుకోవాలని సూచించారు. అనంతరం ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌ఓ నగేష్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పోస్టర్లను ఆవిష్కరించారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

చికిత్స పొందుతూ రైల్వే ఉద్యోగి మృతి

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి గ్రామ శివారులో లింగాల పంపు హౌస్ వద్ద విధి నిర్వహణలో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన రైల్వే ఉద్యోగి ఎస్.షెక్షావలి(42) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే వర్గాలు తెలిపిన వివరాలు.. గుత్తి బీసీ కాలనీకి చెందిన షెక్షావలి గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్-1గా విధులు నిర్వహించేవాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 2న రాత్రి లింగాల పంప్ హౌస్‌కు వెళ్లాడు. అయితే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో నిచ్చెన వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పైనుంచి కింద పడ్డాడు. రైల్వే ఎలక్ట్రికల్ ఉన్నతాధికారులు గుంతకల్లు నుంచి హుటాహుటిన వైద్య బృందంతో కలసి ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ షెక్షావలిని అనంతపురం తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం వేకువజామున అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య బాను, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


షెక్షావలి(ఫైల్)

పశువులకు బీమా చేయించండి

తలుపుల: మండలంలో పాడి పశువులు గల రైతులు పశు బీమా చేయించుకోవాలని ఏడీఏ ప్రసన్నబాయి, పశు వైద్యాధికారి నారాయణ స్వామి నాయక్ తెలిపారు. మంగళవారం ఏడీఏ మాట్లాడుతూ పాడి రైతులు తమ పాడి ఆవు, గేదెలను కొన్న ధర మొత్తానికి ప్రస్తుతం బీమా చేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. బీమా కాలపరిమితి 3 ఏళ్లు ఉంటుందన్నారు. పశుబీమా క్లెయిమ్ చేయడానికి ప్రభుత్వం 80 శాతం ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతు వాటా 20 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఉదాహరణకు గరిష్ఠంగా రూ. 1.20 లక్షల నుంచి, కనిష్ఠంగా రూ. 15 వేల వరకు బీమా చేసుకోవచ్చన్నారు. 30 వేల పాడి ఆవుకు రైతు బీమా కేవలం రూ. 397 చెల్లించాలని, లక్షా ఇరవై వేలకు రూ.6,362 చెల్లిస్తే సరిపోతుందన్నారు. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం వాటా మంజూరు చేసిందని, ఆసక్తి గల పాడి రైతులు పశు బీమాను త్వరితగతిన చేయించుకోవాలని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో మంగళవారం ఓ లారీ టైర్ ఊడిపోయిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. పత్తికొండ వైపు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న లారీకి ఉన్న ఫళంగా టైర్ ఊడిపోయింది. టైర్ సుమారు 200 మీటర్లు దొర్లుకుంటూ వెళ్లింది. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేపోవడంతో ప్రమాదం తప్పింది.

క్లుప్తంగా

పరామర్శ


బాధితున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లికి చెందిన పద్మనాభరెడ్డి ఇటీవల ద్విచక్రవాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందంటూ ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు ఉన్నారు.

తిప్పేపల్లిలో 'పశు విజ్ఞాన బడి'

ఓడీచెరువు: మండలంలోని తిప్పేపల్లి రైతు భరోసా కేంద్ర పరిధిలోని రైతులకు మంగళవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పశు బీమా, గాలి కుంటు వ్యాధి టీకాలు, పశు ఆరోగ్య కార్డుల ఆవశ్యకతను పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ సత్యప్రకాశ్ వివరించారు. కార్యక్రమంలో ఓడీ చెరువు పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సహాయకులు జోష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓకు అభినందనలు


నూతన ఆర్డీఓ వెంకటశివరాంరెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నూతన ఆర్డీఓ వెంకట శివరాంరెడ్డికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నూతన ఆర్డీఓను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తిరుపాలు, తాలూకా అధ్యక్షుడు సాయిప్రకాష్, కోశాధికారి వరప్రసాద్, దీప తదితరులు కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ శ్రీనివాస్‌నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

తనకల్లు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను పరిమిత వేగంతోనే నడపాలన్నారు. వేగంగా వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగి ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. అతి వేగం ప్రాణాంతకమని, ఆటోలు, మినీ బస్సులలో పరిమితికి మించి ప్రయాణీకులను తరలించ కూడదని ఆయన తెలిపారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్‌ను ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా నాగరాజు


నియామక పత్రం అందుకుంటున్న చింతా నాగరాజు

కదిరిటౌన్: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కదిరికి చెందిన చింతా నాగరాజు నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతా నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మక్బూల్ పర్యటన వాయిదా

ఎన్పీకుంట: కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మండల పర్యటన వాయిదా పడిందని ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం కమ్మగుట్టపల్లి నుంచి పర్యటన ప్రారంభం కావాల్సి ఉందని, కానీ అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదా పడిందని తెలిపారు. పార్టీ శ్రేణులు గమనించాలని కోరారు.

కడపకు వెళ్లి పింఛన్ పంపిణీ


కడపకు వెళ్లి దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వరలక్ష్మి

రామగిరి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే దివ్యాంగుడికి వలంటీర్ వరలక్ష్మి వైఎస్సార్ జిల్లా కడపకు వెళ్లి పింఛన్ అందించింది. 60 ఏళ్లుపైబడిన దివ్యాంగుడు వెంకటరెడ్డి కొన్నిరోజులుగా కడపలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రామగిరి ఎస్ఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



రామగిరి: మండల ఎస్ఐగా బీటీ వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ జనార్దన్‌నాయుడు పుట్టపర్తికి బదిలీ అయ్యారు. దీంతో అమరాపురంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఐకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న సాయిలీల

ప్రశాంతి నిలయం: మహిళల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లిలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలీల మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి మహిళలకు ఇంత మేలు చేయలేదన్నారు. ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలబడి మరో సారి గెలిపించుకునేందుకు గట్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓ ఆదినారాయణ, ఆర్‌పీలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మస్వామి ఊరి దేవర


తూంచర్ల ఊరి దేవరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో మంగళవారం పెద్దమ్మస్వామి ఊరిదేవర వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పెదమ్మ, నల్లలమ్మ గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే అమ్మవార్లకు బలితర్పణం చేసి, గ్రామంలోని పొలి వేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊరి దేవరకు హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు..

తూంచర్లలో ఊరి దేవర సందర్భంగా ఏర్పాటు చేసిన విందుకు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ జె. శాంతమ్మ, నియోజకవర్గ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారు గ్రామ దేవతలను దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందురెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.